

ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై విప్ ఆగ్రహం

కొమరాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపుల్లో సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుల నిర్లక్ష్య ధోరణిపై కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో మంజూరైన గృహాలకు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినా.. సంబంధిత అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. ఈ అంశంపై మంగళవారం పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో పరుశురాంపురం సచివాలయ ఇంజనీరింగ్ సహాయకునికి మెమో ఇచ్చి అనంతరం శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మల్లికార్జునరావుకు ఆమె ఆదేశించారు.

ఇక.. మూడు నెలలే!

- ప్రాజెక్టుల ఆధునికీకరణకు జైకా ఇచ్చిన గడువు
- అంతవరకు చేసిన పనుల బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం హామీ
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో సాగని పనులు
- పది వేల ఎకరాలకు అందని సాగునీరు
- తాజాగా కూటమి ప్రభుత్వం చొరవతో పనుల్లో కదలిక
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జియ్యమ్మవలస, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లాలో ప్రాజెక్టుల ఆధునికీకరణకు శాపంగా మారింది. జైకా నిధులున్నా సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా వాటి పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. కాగా ప్రాజెక్టుల ఆధునికీకరణకు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఇచ్చిన గడువు మరో మూడు నేలల్లో ముగియనుంది. దీంతో ఇంజనీర్ల బృందం జైకా టెక్నికల్ కన్సల్టెంట్ సాబ్‌జాన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు పరిశీలించింది. మూడు నెలల గడువులో చేపట్టే పనులకు బిల్లులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంట్రాక్టు ఏజెన్సీలకు ఇంజనీర్ల బృందం భరోసా ఇచ్చింది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని సూచించింది. అయితే తదుపరి గడువు కోసం ప్రభుత్వం జైకాతో మాట్లాడాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి

జిల్లాలో వట్టిగెడ్డ, వెంగళరాయసాగర్, పెదంకలాం, పెద్దగెడ్డ రిజర్వాయర్ల ద్వారా జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలతో పాటు విజయనగరం జిల్లా వంగర మండలంలో మరో 1633.47 ఎకరాలకు సాగునీరందనుంది. కాగా వాటి ఆధునికీకరణకు రూ. 153.83 కోట్లతో జైకా ద్వారా పరిపాలనా ఆమోదం పొందగా, రూ. 125.73 కోట్లకు కాంట్రాక్టు ఏజెన్సీలు అగ్రిమెంట్లు చేసుకున్నాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు ముందుకు సాగలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీలు చేతులెత్తేశాయి. దీనివల్ల శివారు భూములకు సాగునీరందడం గగనమైపోతోంది. ఆధునీకరణ పనుల్లో భాగంగా ప్రధాన కాలువలు కొంత లోతుగా తవ్వడం వల్ల పిల్ల కాలువలకు నీరందడం లేదు. దీంతో దాదాపు పది వేల ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొంది.

పెదంకలాం

ఈ ప్రాజెక్టు సీతానగరం మండలం పెదంకలాం గ్రామం వద్ద ఉంది. దీని ద్వారా జిల్లాలో బలిజిపేట మండలంలో 6,617.16 ఎకరాలకు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 1,638.31 ఎకరాలకు సాగునీరందనుంది. దీని ఆధునీకరణకు జైకా ద్వారా 2019 ఫిబ్రవరి 15న రూ. 17.30 కోట్లతో పరిపాలన ఆమోదం, 2020 జూన్ 20న సాంకేతిక ఆమోదం లభించాయి. సూర్యపేటకు చెందిన ఎం/ఎస్ ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్స్, ఎం/ఎస్ రాజ్‌పద్మ ఇన్ కార్పొరేషన్ సంయుక్తంగా ముందుకొచ్చి నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 2023 డిసెంబరు 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కేవలం 5 శాతం పనులు మాత్రమే జరిగాయి.

పెద్దగెడ్డ

ఈ ప్రాజెక్టు పాచిపెంట మండలంలో ఉంది. దీని ద్వారా పాచిపెంట మండలంలో 6,039 ఎకరాలు, సాలూరులో 2,839 ఎకరాలు, రామభద్రపురం మండలంలో 3,122 ఎకరాలకు సాగునీరంద నుంది. దీని ఆధునికీ కరణకు 2019 ఫిబ్రవరి 15న రూ. 25.18 కోట్లతో పరిపాలన ఆమోదం, 2020 మే 22న సాంకేతిక ఆమోదం లభించాయి. హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ జీవీవీ, వైఎంఎంఆర్ (జేవీ) సంస్థలు ముందుకొచ్చి.. నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో 2020 జూలై 5న ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాస్తవానికి 18 నెలల్లో ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ

(మిగతా 8వ పేజీలో...)



పెద్దగెడ్డ ప్రాజెక్టు



వెంగళరాయసాగర్ ప్రాజెక్టు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి
- జిల్లా మహా సభలు ప్రారంభం

కురుపాం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి తెలిపారు. మంగళవారం కురుపాంలో జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గిరిజనులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో స్థానిక మెయిన్ రోడ్డు నుంచి రావాడ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. దేశ సంపదను అదాని, తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి.. సామాన్యులపై భారం మోపుతోందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన గిరిజనులకు నిధులు కేటాయించడం లేదన్నారు. ఏపీలో సబ్ ప్లాన్ నిధులు కేటాయింపులు, ఖర్చులలోను కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర కల్పించేందుకు జీసీసీ ఏర్పాటు చేయగా బీజేపీ వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. బడా పెట్టుబడిదారులు ఖనిజ సంపద దోచుకునేందుకు వీలుగా అటవీ ప్రాంతంలో సైతం అధిక నిధులతో భారీ రోడ్లు వేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.తులసీదాస్ ఆరోపించారు. మతం పేరిట ప్రజలను విభజించే కుట్రలు జరగుతున్నాయని వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై రానున్న రెండు రోజుల్లో కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అశోక్, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీపీఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, గంగు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి

వ్యవసాయం.. ఇరిగేషన్‌పై దృష్టి

- సీఎంకు వివరించనున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- నేడు, రేపు అమరావతిలో కలెక్టర్ల సదస్సు



పార్వతీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. సమగ్రమైన భవిష్యత్ ప్రణాళిక రూపొందించింది. ఆ నివేదికను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా సీఎం చంద్రబాబు ఈనెల 11,12 తేదీల్లో అమరావతిలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఇప్పటికే బయలుదేరి వెళ్లారు. ఈ సదస్సులో నూతన జిల్లా అభివృద్ధి, మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాల ఏర్పాటు, చెరువులు, కాలువల పనులు తదితర అంశాలను ప్రస్తావించనున్నారు. పామాయిల్, నిమ్మగడ్డి, పశు పెంపకం, రైతులకు సబ్సిడీపై యంత్రాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి వాటిని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు. జిల్లాను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల సమస్యను కూడా సదస్సులో ప్రస్తావించనున్నారు. గిరిజన ప్రాంతాలకు ఆఫ్‌లైన్ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ , పార్వతీపురం, పాలకొండలో తాగునీటి సమస్య, తోటపల్లి, జంఝావతి, వీఆర్ఎస్ ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీరు సరఫరా, సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు జీవోపాధి, పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధి, గృహ నిర్మాణాలు, పార్వతీపురం, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలు, ఐటీడీఏలకు పూర్వ వైభవం, ట్రైకార్ రుణాలు, ప్రభుత్వ భూముల సమస్యలు పరిష్కరించాలని కోరున్నారు.

జాతరలోగా పనులు పూర్తి చేయండి

- శంబర రహదారుల నిర్మాణంపై సబ్ కలెక్టర్ ఆదేశం

మక్కువ, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ ఆలయాల పరిసరాల చుట్టూ జరుగుతున్న రహదారి పనులను జాతరలోగా పూర్తి చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశించారు. మంగళవారం శంబర పోలమాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో క్యూ లైన్లను పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రాంతం, నడివీధి విస్తరణ ఏ విధంగా చేపడుతున్నారన్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వనంగుడి రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు తొలగించాలని గ్రామస్థులు కోరారు. స్తంభాలను షిఫ్టు చేయాలని ఏఈ జోగినాయుడును సబ్ కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుపై ఎఎస్ఐ శ్రీనివాస్‌తో చర్చించారు. పార్కింగ్ ఏర్పాటు నివేదికను త్వరగా అందజేయాలన్నారు. తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఈవోపీఆర్‌డీ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సాలూరు రూరల్/గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో 1,590 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 11 నుంచి 19 వరకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు 11న తెలుగు, 12, ఇంగ్లిష్, 13న గణితం, 16న పరిసరాల విజ్ఞానం పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6,8,10 తరగతుల వారికి ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. 7,9 తరగతుల వారికి మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు నుంచి పదో తరగతులకు ఈ నెల 11న తెలుగు, 12న హిందీ, 13న ఇంగ్లిష్, 16న గణితం, 17న భౌతిక శాస్త్రం, 18న జీవశాస్త్రం, 19 సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్న పత్రాలను ఎంఈవో కార్యాలయాల నుంచి పొందాల్సి ఉంది. ఎస్ఏ-1 పరీక్షల విధానంపై హెచ్‌ఎంలకు సమాచారం అందించామని గరుగుబిల్లి ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

భామిని, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం భామిని, బాలేరు, బత్తిలి పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. అన్ని రకాల మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలన్నారు. బాలేరు పీహెచ్‌సీలో పీవో స్వయంగా రక్త పరీక్షలు చేయించుకొని సిబ్బంది పనితీరును పరిశీలించారు.

వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

భామిని పీహెచ్‌సీలో బయో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని ఇన్‌చార్జి పీవో గమనించారు. దీంతో వైద్యాధికారులు సంతోషి లక్ష్మి, సోయల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బత్తిలి పీహెచ్‌సీలో హెల్త్ విజిటర్ బాలనాగమ్మ వద్ద గర్భిణులకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో ఆమెకు కూడా నోటీస్ అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భామిని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఇన్‌చార్జి పీవో

కాలమే ముఖ్యం

- ప్రతి వస్తువుకూ నిర్ణీత గడువు
- ఆలోగా వినియోగించాల్సిందే
- ఆ సమయం దాటితే ఇబ్బందులు

6లో

డేంజర్ డీజే

- ప్రాణాలు తీస్తున్న డీజేలు.. భారీ శబ్దాలు
- ఉన్నట్లుండి కుప్పకూలుతున్న యువత
- బ్రెయిన్ స్ట్రోక్, శాశ్వత వినికిడి లోపం తలెత్తే ప్రమాదం
- హృద్రోగులు, వృద్ధులు దూరంగా ఉండాలంటున్న వైద్యులు


కూటమిలో జోష్

- విజయవంతమైన పార్టీ శ్రేణుల సమావేశం
- ముఖ్య నేతల ప్రసంగాలతో నూతనోత్సాహం
- నీటి సంఘాల ఎన్నికలపై దిశానిర్దేశం
- త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ

పార్వతీపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా సోమవారం పార్వతీపురంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశం విజయవంతమైంది. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశానికి నాలుగు నియోజకవర్గాలకు చెందిన పెద్దఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, కూటమి ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ తదితరులు తమ ప్రసంగాలతో కేడర్‌లో జోష్ నింపారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని, ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేడర్ కష్టసుఖాల్లో అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. నాలుగు నియోజక వర్గాల్లో పార్టీ పటిష్టతో పాటు ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేయాలని సూచిం చారు. గత ఎన్నికల్లో వెన్నుపోటు పొడిచిన నాయకులను కాకుండా, పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. కాగా ఈ సమావేశానికి టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి హాజరుకాక పోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై పార్టీ అధిష్ఠానికి ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు..

జిల్లాలోని నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు ప్రారంభమైంది. నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నాయకులను ఎంపిక చేయనున్నారు. ఆ జాబితాను తొలుత మంత్రి సంధ్యారాణికి అందించిన తర్వాత పార్టీ అధిష్ఠానికి జాబితా పంపించనున్నట్లు సమాచారం.



నీటి సంఘాల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

నీటి సంఘాల ఎన్నికలు, పార్టీ సభ్యత్వాలపై టీడీపీ క్యాడర్‌కు మంత్రి సంధ్యారాణి దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది ఓటర్లు ఉంటే తప్పనిసరిగా 250 సభ్యత్వాలు నమోదు కావాలని సూచించారు. నీటి సంఘాల ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, కూటమి శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నీటి సంఘాన్ని కైవసం చేసుకోవాలని మంత్రి కోరారు.


అవతలికి దూకుదాం..


అయ్యో...గాజు ముక్క గుచ్చుకుందే...

ఉడుతా ఉడుతా ఊచ్... ఆహారం దొరికిందోచ్!

విజయనగరం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనగనగా కొన్ని ఉడుతలు. ఆ ఉడుతమ్మలకు ఆకలేసింది. తినడానికి ఏమైనా దొరుకుతుందేమోనని చుట్టూ చూశాయి. కానీ ఫలితం లేదు. ఎట్టకేలకు కోటకు ఆనుకొని ఉన్న ఓ అపార్ట్‌మెంట్ గోడకు సమీపంలో ఏవో పండ్లు కనిపించాయి. వాటిని అందుకోవడానికి గోడపైకి దూకాయి. కానీ ఆ గోడపై రక్షణ కోసం సంబంధిత యజమాని గాజు పెంకులు అమర్చారు. ఆకలి ముందు... ప్రమాదం చిన్నగా కనిపించిందేమో ఆ ఉడుతలు గోడపైకి దూకాయి. కొన్ని గాయపడ్డాయి. అయినా ఎలాగోలా ఆహారాన్ని దక్కించుకొని తిరుగుముఖం పట్టాయి. ఈ దృశ్యాలు మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.


జాగ్రత్త...చూసుకొని నడువు...


హమ్మయ్య...పండును పట్టేశా


ఇంకా ఏమైనా ఉన్నాయంటారా?..



కాలమే ముఖ్యం

- ప్రతి వస్తువుకూ నిర్ణీత గడువు
- ఆలోగా వినియోగించాల్సిందే
- ఆ సమయం దాటితే ఇబ్బందులు

కాలం... మనుషులకే కాదు. వస్తువులకూ ముఖ్యమైనదే. మనలాగే వస్తువులకు నిర్ణీత జీవిత కాలం ఉంటుంది. ఆ సమయంలో వాటిని వినియోగించాల్సిందే. లేదంటే అవి ఉపయోగపడవు. ఇంట్లోనో... అందుబాటులోనో ఉన్నాయి కదా అని వాటిని వినియోగిస్తే దుష్ఫలితాలే ఎక్కువని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. అవేంటో.. ఎలాగో చూద్దాం రండి.

రాజాం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ బల్బు నుంచి కారు వరకూ... కాలింగ్ బెల్ నుంచి కంప్యూటర్ వరకూ..వాడే పౌడర్, స్ప్రే చేసే పెర్‌ఫ్యూమ్.. గ్యాస్ స్టౌ.. వస్తువు ఏదైతేనేం.. ప్రతిదీ కొన్ని ప్రమాణాలతో తయారవుతుంది. ఆ మేరకే అది ఉపయోగపడుతుంది. కొంతకాలమే మన్నిక ఉంటుంది. మారుతున్న కాలంతో పాటు వస్తువుల వినియోగంలో మార్పులొచ్చాయి. ఎక్కువ డబ్బులిచ్చి కొన్న వస్తువు కదా అన్ని ఎక్కువ కాలం వాడుకుందామంటే వీలుపడకపోవచ్చు. వాడే విధానంలోనే అది పనిచేసే కాలం ఆధారపడి ఉంటుంది. అన్నిటికంటే... దాని కాల వ్యవధిలోనే వినియోగించాలి. ఆ తరువాత వాడితే కష్టాలు.. నష్టాలు తప్పవు. ఒక్కో వస్తువు సేవలను దాని ప్రమాణాల మేరకు తయారీ తేదీ నుంచి నిర్ణీత కాలంలోనే వినియోగించాలి. కొన్నింటి గురించి తెలుసుకుందాం...

ద్విచక్ర వాహనం..

- **కాల పరిమితి:** 50 వేల నుంచి లక్ష కిలోమీటర్లు.
- **ఎందుకంటే:** ద్విచక్ర వాహనాలు 25వేల కిలోమీటర్లు దాటగానే వాటి టైర్లు పూర్తిగా అరిగిపోతాయి. ట్యూబుల సంగతి సరేసరి. పది నుంచి 15 వేల కిలోమీటర్లు తిరగగానే ఇంజన్ మరమ్మతులను ఆహ్వానిస్తుంది. 60వేల కిలోమీటర్ల నుంచి లక్ష కిలోమీటర్ల మధ్య చెయిన్, సాకెట్, వెనుక చక్రం డ్రమ్ములు మార్చాల్సి ఉంటుంది. నిత్యం తలెత్తే సమస్యలు సరేసరి. లక్ష దాటితే కష్టాలే.

రన్నింగ్, వాకింగ్ షూలు..

- **కాలపరిమితి:** మూడు నుంచి ఆరు నెలలు.
- **ఎందుకంటే:** ఉదయం పరుగు, వ్యాయామాలకు ఉపయోగించే షూలను 300 నుంచి 600 మైళ్లు దాటగానే కొత్తవి కొనడం శ్రేయస్కరం. ఎందుకంటే వీటిలో ఉండే ఫోం పనితనం తగ్గుతుంది. దీంతో అరికాళ్లు, మడమల మీద ఒత్తిడి పెరిగి నొప్పులకు దారితీస్తాయి.



టూత్ బ్రష్..

- **కాలపరిమితి:** మూడు నెలలు.
- **ఎందుకు:** అంతకుమించి బ్రష్ వాడకూడదు. ఇది పెలుసుబారి పనితనం తగ్గుతుంది. అలాంటివి ఉపయోగిస్తే దంతాలపై చెడు ప్రభావం పడుతుంది. చిగుళ్ల వాపు, రక్తస్రావం జరిగే అవకాశాలు ఎక్కువ.

ఫ్యాన్లు..



- **కాలపరిమితి:** రెండు నుంచి మూడేళ్లు.
- **ఎందుకు:** రెండేళ్ల నుంచి మూడేళ్లు దాటితే ఫ్యాన్ల నుంచి గరగర శబ్దాలు వస్తాయి. అలాగే వైండింగ్ పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది. బేరింగ్‌లు కూడా పాడయ్యే వీలుంది.

పరుపులు..

- **కాలపరిమితి:** అయిదు నుంచి ఆరేళ్లు.
- **ఎందుకు:** ఏడాదికేడాదికి మెత్తదనం కోల్పోతాయి. గట్టి పడడం వల్ల వెన్ను, మెడనొప్పులు ప్రారంభమవుతాయి. శుభ్రం చేసినా దుమ్ము, ధూళిని ఆకర్షించి.. చర్మవ్యాధులకు కారణమవుతాయి. దిండును రెండేళ్ల కన్నా ఎక్కువగా వాడితే వెడల్పుగా మారి అసౌకర్యంగా ఉంటుంది. దిండు మంచిదైతే అరనిమిషం పాటు సగానికి మడిచి విడిచిపెడితే వెంటనే అది యథాస్థితికి రావాలి. లేదంటే దాని నాణ్యతను అనుమానించాల్సిందే. మంచి దిండును గుర్తించే పద్ధతి ఇదే.

గ్యాస్ స్టవ్..



- **కాలపరిమితి:** ఐదేళ్లు.
- **ఎందుకు:** రెండేళ్లు దాటేసరికి గ్యాస్ స్టవ్ బర్నర్లు, నాజిళ్లు మూసుకుపోతాయి. దీంతో గ్యాస్ సరఫరా సరిగ్గా ఉండదు. ఫలితంగా గ్యాస్ వృథా అవుతుంది. అయిదేళ్ల తరువాత గ్యాస్ స్టవ్ మార్చుకుంటే మేలు. మార్చని పక్షంలో కనీసం బర్నర్లు, పైపులు మార్చుకోవడం మంచిది. గ్యాస్ ట్యూబ్‌లు బ్రాండెడ్‌వి కాకపోతే ఆరునెలలకోమారు మార్చాల్సి ఉంటుంది. స్టెయిన్‌లెస్ స్టీల్ గ్యాస్ స్టవ్‌లను తీసుకున్నా పని తీరులో ఏమాత్రం మార్పు కనిపించదు.

కంప్యూటర్..



- **కాలపరిమితి:** నాలుగైదేళ్లు.
- **ఎందుకు:** కంప్యూటర్‌ను నిత్యం వినియోగిస్తుంటాం. లేదంటే సమస్యలు తప్పవు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్లోకి కంప్యూటర్లు వస్తున్నాయి. దీంతో అధికశాతం వాటినే కొంటారు. ఇటీవల ల్యాప్‌ట్యాప్‌లు కొనేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయినాసరే వీటి వినియోగం తగ్గలేదు. నాలుగేళ్లు దాటితే కంప్యూటర్ తిప్పలు పెడుతుంది. ర్యాం మార్చాలి. నాలుగేళ్లకు మించి వాడకూడదంటున్నారు నిపుణులు.

సౌందర్య సాధనాలు..

- **కాలపరిమితి:** ఏడాది నుంచి 18 నెలలు.
- **ఎందుకు:** రోజులు గడిచే కొద్దీ సౌందర్య సాధనాలలో బ్యాక్టీరియా చేరుతుంది. అటువంటివి వినియోగిస్తే ఎలర్జీ, ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. సౌందర్య సాధనాలలో త్వరగా బ్యాక్టీరియా చేరుతుంది. ఏడాది కన్నా ఎక్కువ కాలం వాడకూడదన్నని నిపుణుల సూచన.

అత్తరు..



- **కాలపరిమితి:** రెండేళ్లు.
- **ఎందుకు:** బాడీ స్ప్రేయర్, పెర్‌ఫ్యూం వంటివాటిని ఏడాది కన్నా ఎక్కువ కాలం వినియోగించకూడదు. వాటిపై 36 నెలల కాలపరిమితి అని ముద్రించినా వీలైనంత త్వరగా వాడేయాలి. వెలుతురు, వేడిగాలి తగిలితే అందులోని సువాసన తగ్గుతుంది.


జ్ఞాపికలను అందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం/టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల దినోత్సవ ముగింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ఎంత పరిశుభ్రంగా ఉంచుతామో.. కార్యాలయాల్లో ఉన్న వాటిని కూడా అంతే పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో, సంతలు, దేవాలయాల చుట్టూ బహిరంగ మలవిసర్జన జరగకుండా చూడాలన్నారు. 7,500 వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం అధికారులు నివేదికలు ఇచ్చారని, వాటిని స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.15 వేలు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచిన మూడు ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలను అందించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సంచాలకులు రామచంద్రరావు, సత్యంనాయుడు పాల్గొన్నారు.

తాగునీరందించండి సారూ!

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పాలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'మా కాలనీకి తాగునీరు అందిచండి సారూ' అని గారమ్మ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాలకొండ నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. రోజూ నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు పల్లా కొండబాబు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణకు తెలియజేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో మహిళలు అక్కడి నుంచి వెనుదిరిగారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు


ఎరుకలి పాకలు గ్రామం

కొత్త రూపు.. పాత పేరు!

- ఇదీ ఎరుకలి పాకలు విశిష్టత


వెదురు బుట్ట అల్లుతున్న గజరాయునివలస ఎంపీటీసీ పాలవలస గౌరు

బొబ్బిలి /బాడంగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతంలోని ఇళ్ల తీరును బట్టి దశాబ్దాల కిందట ఆ ఊరికి పెద్దలు పేరు పెట్టారు. కాలం మారింది. ఆ ఊరి స్వరూపమూ మారింది. అక్కడి మనుషుల తీరూ మారింది. కానీ పేరు అలాగే ఉంది. ఆ పేరు చెబితేనే అందరికీ ఠక్కున ఆ ప్రాంతం గుర్తుకువస్తుంది. ఇదీ బాడంగి మండలం లక్ష్మీపురం పంచాయతీ మధుర గ్రామమైన ఎరుకలి పాకలు ప్రత్యేకత.

150 కుటుంబాలు..

ఎరుకలి పాకలు గ్రామంలో 150 కుటుంబాలు ఎరుకలి కులస్తుల వారు ఉన్నారు. అక్కడి జనాభా సుమారు 600. వారిలో 20 కుటుంబాల వారు అమరావతి ప్రాంతానికి ఇటుకల తయారీ పని కోసం వెళుతుంటారు. వీరి కుల వృత్తి వెదురుతో బుట్టలు, తట్టలు, ధాన్యం గరిసెలు, ఇతర వ్యవసాయ పరికరాలను తయారు చేయడం. ప్లాస్టిక్ వినియోగం విరివిగా పెరిగిపోవడంతో ఆ ప్రభావం కులవృత్తిపై పడింది. వీరి మరో వృత్తి బాణసంచా తయారీ. కుల వృత్తులు పెద్దగా ఉపాధిని కల్పించకపోవడంతో ఏడాదికి రెండు సార్లు అటు అమరావతికి, ఇటు శ్రీకాకుళం జిల్లా ప్రాంతాలకు వలస వెళుతుంటారు.

వెదురుబుట్టలు అల్లుతున్న వృద్ధుడు



పూరిపాకలతో...

మొత్తం గ్రామమంతా 30 ఏళ్ల క్రితం గుబురైన చెట్ల మధ్య పూరిపాకలతో ఉండేది. అత్యంత దయనీయంగా వారు జీవనం సాగించే వారు. ఇప్పటికీ చాలామంది భిక్షాటన చేస్తుంటారు. ఎన్టీఆర్ సారధ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎరుకలి పాకలు గ్రామం రూపురేఖలు క్రమేపీ మారిపోయాయి. దివంగత తెర్లాం ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ సహకారంతో గ్రామంలోని అన్ని కుటుంబాలకు పక్కా ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. పూరిపాకల స్థానంలో ఇప్పుడు అన్నీ శ్లాబు ఇళ్లే కనిపిస్తాయి. ఈ గ్రామానికి చెందిన పాలవలస గౌరు-పార్వతి భార్యాభర్తలు. వారే ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు. వీరు కులవృత్తి అయిన వెదురుబుట్టలు, బాణాసంచా తయారీలో పాల్గొంటారు. వరి పంటలు కోతకు వచ్చే సమయంలో పాలకొండ తదితర ప్రాంతాలలో వెదురు పరికాల తయారీకి ఎరుకలి వారు వలస వెళతారు. అక్కడ ఇంటిల్లిపాదీ కష్టపడి ఏడాదికి సరిపడా తిండి గింజలను సంపాదించుకుంటారు. ఫిబ్రవరి రాగానే పెళ్లిళ్ల సీజన్‌లో బాణసంచాకు డిమాండ్ ఉండడంతో ఆ పనుల్లో నిమగ్నమవుతారు. దీపావళి సీజన్ ముగియగానే కార్తీకమాసంలో వలస బాట పడతారు.

వారి పుణ్యమే..

మా ఊరి రూపురేఖలు మారిపోయాయి. పూరిపాకల స్థానంలో అన్నీ పక్కా ఇళ్లు వెలిశాయి. అన్న ఎన్టీఆర్, తెంటు జయ ప్రకాశ్ పుణ్యమా అని గ్రామానికి వెలుగు వచ్చింది. ప్రస్తుత ఎమ్మెల్యే బేబీనాయన, తెంటు లక్ష్మునా యుడులు సంపూర్ణ సహకారం అందజేస్తు న్నారు. మేమంతా వలస పక్షులం. ప్లాస్టిక్ ఇతర సామగ్రి వచ్చి మా పొట్ట కొట్టింది. అందుకే వలసలు వెళ్లక తప్పడం లేదు. మా ఊరిపేరును ఎరుకలి పల్లె లేదా పేట అని అధికారికంగా మార్చాలని యోచిస్తున్నాం. బాణసంచా తయారీ లైసెన్సుల జారీని పూర్తిగా ఎరుకలి కులాల వారికి మాత్రమే వర్తింపజేయాలని ప్రభుత్వాలను అర్థిస్తున్నాం.

-పాలవలస గౌరు, ఎంపీటీసీ, గజరాయునివలస



డేంజర్ డీజే

- ప్రాణాలు తీస్తున్న డీజేలు.. భారీ శబ్దాలు
- కుప్పకూలుతున్న యువత
- బ్రెయిన్ స్ట్రోక్, శాశ్వత వినికిడి లోపం తలెత్తే ప్రమాదం
- హృద్రోగులు, వృద్ధులు దూరంగా ఉండాలంటున్న వైద్యులు



గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివాహాలు... ఇతర ఉత్సవాలు.. ఊరేగింపుల సమయంలో వినియోగిస్తున్న డీజే శబ్దాలు మరణ మృదంగాలవుతున్నాయి. వేళాపాళా లేకుండా వీటిని వినియోగించి... కొందరు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. వీటి కారణంగా వినికిడి సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. కేవలం కొందరి ఉత్సాహం... ఎంతోమందికి అనారోగ్య సమస్యలు తెచ్చి పెడుతోంది.

మితిమీరితే నష్టాలే..

అధిక శబ్దాల వల్ల గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, వినికిడి శక్తి కోల్పోవడం, చెవిలో శబ్దాలు రావడం, కర్ణభేరి దెబ్బతినడం, అధిక రక్తపోటు, ఒత్తిడి, నిద్రలేమి, మానసిక ఆందోళన, గుండె దడ, గర్భ విచ్ఛిత్తి, గర్భంలోని శిశువుకు భవిష్యత్‌లో వినికిడి లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి..

పెద్ద పెద్ద చప్పుళ్ల వల్ల ఇబ్బంది పడే వారిని ఎలాంటి శబ్దాలూ లేని ప్రశాంతంగా ఉన్న గదిలోకి తీసుకెళ్లాలి. గాలి ఆడేలా కూర్చోబెట్టి తాగడానికి నీరందించాలి. దీనివల్ల బాధితులు కొద్ది సేపటికే ఉపశమనం పొందుతారు. భారీ శబ్దాలకు తీవ్రంగా చెమటలు పట్టి గుండె దడ పెరిగి, కళ్లు తిరిగి ఎవరైనా కింద పడిపోతే వెంటనే వారిని ఆసుపత్రిలో చేర్చాలి.

పరిమితి దాటితే ప్రమాదమే..

సాధారణంగా 70 డెసిబుల్స్ శబ్దాలు వినడం వరకే చెవులు సహకరిస్తాయి. 70 నుంచి 85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని 8 గంటల పాటు వినవచ్చునని నిపుణులు చెబుతారు. 90 డెసిబుల్స్‌కు 4 గంటలే పరిమితి. డీజే శబ్దం 200 డెసిబుల్స్ పైనే ఉంటుంది. ఇది అత్యంత ప్రభావం చూపుతుంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

రాత్రి 10 నుంచి ఉదయం 8 గంటల మధ్య ఊరేగింపులను భారీ శబ్దాలతో నిర్వహించకూడదు. 70 డెసిబుల్స్ స్థాయి వరకే శబ్దం పెట్టుకోవడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. అంతకుమించితే చట్టరీత్యా నేరం. అయినా ఇది ఎక్కడా అమలు కావట్లేదు. ఆసుపత్రులు, పాఠశాలలు, కోర్టులను సైలెంట్ జోన్లుగా పరిగణిస్తారు. ఇటువంటి ప్రాంతాల్లో డీజే శబ్దం 70 డెసిబుల్స్ దాటితేనేరమవుతుంది.

ప్రాణాల మీదకు తెచ్చిన డీజే..

- విజయనగరం జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే శబ్దానికి ఓ యువకుడు మృతి చెందాడు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 ఏళ్ల వినయ్ దసరా ఊరేగింపులో అధిక శబ్దాల మధ్య ఉత్సాహంగా నృత్యం చేశాడు. ఉన్నట్లుండి కుప్పకూలడంతో ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు.
- అనకాపల్లి జిల్లాకు చెందిన బండారు రాజపాత్రుడు నాగుల చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన డీజే శబ్దాన్ని తట్టుకోలేక గుండెపోటుతో మరణించాడు.
- ఒడిశాలోని మల్కన్‌గిరి పట్టణంలో ఓ ప్రేమ జంట పెద్దలను ఒప్పించి పెళ్లికి సిద్ధమైంది. అమ్మాయి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నిశ్చితార్థానికి కుటుంబ సమేతంగా వరుడు హాజరయ్యారు. ఆ వేడుకలో డీజే పెట్టగానే యువకుడి తండ్రి అక్కడికక్కడే గుండెపోటుతో మృతి చెందారు. ఇలాంటి సంఘటనలు రెండు తెలుగు రాష్ట్రాల్లో మరికొన్ని చోట్ల జరిగిన ఉదంతాలూ ఉన్నాయి.

గుండె పోటు ముప్పు..



అధిక శబ్దాల వల్ల గుండె కొట్టుకోవడంలో మార్పులు సంభవిస్తాయి. 80 డెసిబుల్స్ దాటితే గుండెపై ప్రభావం పడుతుంది. డీజే వంటి భారీ శబ్దాల వల్ల ఒత్తిడి, బీపీ, గుండె కొట్టుకోవడం అమాంతంగా పెరుగుతాయి. బాధితుల్లో అలజడి, గుండె దడ, తలనొప్పి మొదలవుతాయి. రక్తపోటు 200 దాకా పెరిగి మెదడులోని నరాలు చిట్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయే ప్రమాదం ఉంది. రక్తపోటుతో నరాలు దెబ్బతిని కొందరికి పక్షవాతం రావచ్చు. పుట్టుకతోనే గుండె వ్యాధులు ఉన్నవారు, బైపాస్ సర్జరీ చేయించుకున్నవారు, స్టెంట్‌లు వేయించుకున్న వారికి కార్డియాక్ అరెస్ట్ వస్తుంది. అలాంటివారు చెవుల్లో దూది పెట్టుకోవాలి. శబ్దాల నుంచి దూరంగా వెళ్లడం, ఇంటి తలుపులు మూయడం ఉత్తమం. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు డీజేలకు దూరంగా ఉంటే మంచిది.

-డాక్టర్ కేకే సాగరవర్మ, పీహెచ్‌సీ, గరుగుబిల్లి


వంగర వద్ద అధిక బరువుతో వెళ్తున్న ట్రాక్టరు

పరిమితి లేక.. నిబంధనలు పాటించక

- తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నవైనం
- అధిక బరువుతో కర్మాగారానికి చెరకు తరలింపు

వంగర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వంగర, కొప్పర, బంగారువలస, మడ్డువలస, శివ్వాం తదితర గ్రామాల నుంచి ప్రతి రోజూ చెరకు లారీల్లో పరిమితికి మించి బరువుతో సంకిలి చక్కెర కర్మాగారానికి తరలిస్తున్నారు. దీనికితోడు నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధిక బరువుతోపాటుఎక్కువ ఎత్తుతో చెరకు లోడు తరలించే సమయంలో తీగలకు తగిలి విద్యుదాఘాతాలు జరుగుతున్నాయి. రేగిడి మండలంలోని సంకిలి సుగర్ చెక్కర కర్మాగారానికి ప్రతిరోజూ 25 నుంచి 30 వాహనాల్లో చెరకు తరలిస్తున్నారు. 16 కిలోమీటర్ల పరిధిలో తొమ్మిది గ్రామాల్లోని జనావాసాల మీదుగా పరిమితికి మించి బరువుతో తరలించడంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వాస్తవానికి ఒక వాహనంలో ఎనిమిది టన్నులు మాత్రమే తరలించాల్సి ఉండగా, 13 నుంచి 14టన్నుల వరకూ చెరకు తరలిస్తున్నారు.చెరకు తరలించే సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో రేగిడి మండలంలోని సరసనాపల్లి వద్ద మడ్డువలస కాలువలో టాక్టరు బోల్తాపడడంతో అప్పట్లో డ్రైవర్ గాయపడిన విషయం విదితమే. గత ఏడాది జనవరిలో సంకిలి వద్ద ట్రాక్టరులో తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందగా, సీతారాంపురం వద్ద ట్రాక్టర్‌తో కర్మాగారానికి లోడు తరలిస్తుండగా గత ఏడాదిడిసెంబరులో విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతిచెందినవిషయం విదితమే. కాగా కర్మాగారానికి చెరకు తరలించే ట్రాక్టర్లు, లారీల నిర్వాహకులను పిలిచి అవగాహన కల్పిస్తామని ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి

పూసపాటిరేగ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడమ్మఅగ్రహారం జంక్షన్ వద్ద ఆటోలో నుంచి ఓ మహిళ జారిపడడంతో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గోవిందపురం నుంచి అదే గ్రామానికి చెందిన కొమ్మూరి వరలక్ష్మి(45)విజయనగరం వైపు ఆటోలో మంగళవారం వెళ్తోంది. చోడమ్మఅగ్రహారం జంక్షన్ వద్ద ఆటోలో నుంచి జారిపడడంతో అక్కడి క్కడే మృతి చెందింది.వరలక్ష్మి భర్త సత్తిబాబు గతంలో మృతిచెందాడు. దీంతో గోవిందపురంలో బడ్డీఏర్పాటుచేసుకుని జీవిస్తోంది. వరలక్ష్మికి కుమార్తెతోపాటు కుమారుడు ఉన్నారు.ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసును నమోదుచేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

గజపతినగరం డిసెంబరు10:(ఆంధ్రజ్యోతి):చికిత్సపొందుతూ ఓ వివాహిత మృతిచెందినట్లు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..మండలంలోని మరుపల్లికి చెందిన చుబుకు రామలక్ష్మి(26) గతనెల 29న గజపతినగరం రైల్వే పట్టాల పక్కన పురుగుల మందుతాగి అపస్మారకస్థితిలో పడిఉంది.దీంతో జిల్లా కేంద్రాసుపత్రికి చికిత్సకోసం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ రామలక్ష్మి మృతి చెందింది. భర్త చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సామాజిక సేవ చేయాలని తీర్పు

పూసపాటిరేగ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రవానిపాలెం పరిధిలో సోమవారం కోడిపందేలు ఆడుతున్న వారిని మెజిస్ట్రేట్ ఎం.శ్రీనివాసరావు వద్ద హాజరుపరచగా ఐదురోజులపాటు సామాజికసేవ చేయాలని తీర్పుఇచ్చినట్లు ఎస్‌ఐ దుర్గారావు తెలిపారు. కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, నాలుగు కోడిపుంజులు, ఆరువేల రూపాయల నగదు, ఎనిమిది మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తీర్పును అనుసరించి వీరికి ఒకరోజు పోలీస్‌స్టేషన్ వద్ద, మూడురోజులు ఆసుపత్రులు, ఒకరోజు పాఠశాలల వద్ద ఉదయం పది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ శుభ్రంచేయాలని తీర్పుఇచ్చినట్లు తెలిపారు.

చినమదుపాడలో కోడిపందేలపై దాడి

గంట్యాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని చినమదుపాడ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నవారిపై మంగళవారం విజయనగరం పోలీసు దాడిచేసి పట్టుకున్నారు. ఈమేరకు ఐదుగురిని అదుపులో తీసుకోగా, ఏడు ద్విచక్రవాహనాలు,రెండు సెల్‌ఫోన్లు,1000 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సాయికృష్ణ తెలిపారు.

అంబాడలో గడ్డివాము దగ్ధం

రేగిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాడలో మడ్డువలస గట్టుపై ఉన్న మజ్జిసత్యం గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. గ్రామస్థుల కథనం మేరకు.. అగ్నికిలల వేడికి గడ్డివాము పైనుంచి ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌వైర్లు తెగిపోయాయి. ఆ సమయంలో ఎవరూలేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా కొద్దిసేపు అంబాడ, వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాలకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది. సమాచార తెలుసుకొన్న లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌వైర్లు సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. పక్కనే మడ్డువలస కాలువలో నీరు ఉండడం గ్రామస్థులు అప్రమత్తమై మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు.

ఏపీవోను నిలదీసిన మహిళలు

శృంగవరపుకోట,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఏ నిబంధన ప్రకారం గ్రామంలోని వీవోఏ గుడిశ త్రివేణిని మార్చారని మహిళా సంఘ సభ్యులు ఏపీవోను నిలదీశారు.మంగళవారం మండలంలోని వసి గ్రామంలో మహిళసంఘ సభ్యులు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహిళ మార్టు ఏర్పాటుకు పెట్టుబడి నిమిత్తం వసూలుచేసిన రూ.87వేలకు గాను మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోవడంపైన నిలదీశారు. ఐదు నెలల నుంచి గ్రామసంఘాల సమావేశం సీసీలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రశ్నించారు. కార్యక్రమంలో మహిళ సమైక్య గ్రామ అధ్యక్షురాలు కారుకొండ సత్యవతి పాల్గొన్నారు.

వసతిగృహ అధికారి సస్పెన్షన్

కొత్తవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన కొత్తవలస బీసీ బాలికల వసతిగృహం అధికారి నీరజాకుమారిపై సస్పెన్షన్ వేటుపడింది.కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు సోమవారం సాంఘిక సంక్షేమశాఖ అధికారులు హాస్టల్‌లో విచారణ నిర్వహించారు. ఈ మేరకు విచారణలో బాలికలు చెప్పిన అంశాలను నమోదు చేసుకుని కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నీరజా కుమారిని సస్పెండ్ చేసి ఆమె స్థానంలో ఇంటర్ ఎస్సీ విద్యార్థినిల హాస్టల్ వార్డెన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆమెపై శాఖాపరంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా పాఠశాలకు, తాము ఉంటున్న హాస్టల్‌కు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో హాస్టల్‌ను ప్రస్తుతం హైస్కూల్‌కు దగ్గరలో ఖాళీగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌కు మార్పుచేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.ఈమేరకు అధికారులు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

శృంగవరపుకోటలో గీతా పఠన పోటీలు

శృంగవరపుకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన గీతాపఠన పోటీల్లో బొబ్బిలి లాంస్యకు ప్రథమ, బొబ్బిలి హృషీకేశ్‌కు ద్వితీయ, కటకం తన్విక‌కు తృతీయ బహుమతులు లభించాయి.ఈ మేరకు వారిని కథా రచయిత్రి కొల్లా పుష్పవాని అభినందించారు. ప్రతి ఆదివారం గీతాపఠన శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకురాలు కె.పావని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టండి

నెల్లిమర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘాపెట్టాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లోమహిళా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్ట్ షాపులు నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని నిరసన

కొత్తవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ దిగువ ఎర్రవానిపాలెంలో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత దంతులూరి రమాదేవిని అవమానపరిచిన హెచ్‌ఎం శారదపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు మంగళవారం పాఠశాల వద్ద గ్రామస్థులకు ఆందోళనకు దిగారు. ఇటీవల నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో రమాదేవి చీరలు, మిఠాయిలు పంపిణీ చేయడంతో హెచ్‌ఎం శారద జీర్ణించుకోలేక పోయారని గ్రామస్థులు వాపోతున్నారు.దీంతో రమాదేవిని అవమానపరచడంతో క్షమాపణ చెప్పాలని హెచ్‌ఎంను కోరగా అంగీకరించకపోవడంతో పాఠశాల వద్ద ఆమెతో కలిసి నిరసన తెలిపారు. శారదపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. కాగా ఈ విషయాన్ని విలేకరులు శారదను వివరణ కోరే ప్రయత్నం చేయగా తనను మండల విద్యాశాఖాధికారి రమ్మన్నారని వెళ్లిపోయారు.

పైపులైన్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజపతినగరం, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): గజపతినగరం మేదరవీధిలో పైపులైన్లకు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. తాగు నీరు వృథా శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఈవో జనార్దనరావు సిబ్బంది సహాయంతో మేదరవీధిలో పాడైన ఇంటింటి కొళాయి ట్యాప్‌లను తొలగించి కొత్తగా ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. అలాగే పాడైన పైపు లైన్లను మరమ్మతులుచేశారు.

చంద్రబాబుకు కర్రోతు వినతి


చంద్రబాబునాయుడుకు సమస్యలు వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. ఈమేరకు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడును కలిశారు.ఈసందర్భంగా నియోజకవర్గ సమస్యలు, రాజకీయ పరిస్థితులు వివరించినట్లు బంగార్రాజు తెలిపారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

రాజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎలక్ట్రికల్ విద్యార్థులకు గోపాలపురం సబ్‌స్టేషన్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు మంగళవారం శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం. రాజేశ్వరరావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలుచేయాలి

చీపురుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని కర్లాం శ్రీవెంకటరామా పౌల్ట్రీ కార్మికులు కోరారు.ఈమేరకు మంగళవారం చీపురుపల్లిలోని గెడ్డ మిల్లు జంక్షన్ నుంచి కార్మికులు ర్యాలీ, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వేతన పెంపుదలపై గతంలో కుదిరిన ఒప్పందాన్ని యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు గురునాయుడు, ఈశ్వరరావు, సీఐటీయూ ప్రతినిధులు అంబల్ల గౌరినాయుడు, విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

బొండపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబటివలసలో ప్రభుత్వానికి చెందిన వాగు గోర్జిని ఆక్రమించి, అక్రమంగా భవన నిర్మాణం చేపట్టిన యజమానికి నోటీసులు జారీచేయడంతోపాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐ ఎస్.హరికృష్ణ తెలిపారు. గ్రామంలోని సర్వేనెంబరు 69లోని 2లో గోర్జిని గ్రామానికి చెందిన కెల్ల చంద్రరావు ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టినట్టు గుర్తించామని పేర్కొన్నారు.తమకు అందిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టినట్టుగా గుర్తించి ఆక్రమదారులు శిక్షార్హులని బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

●నెల్లిమర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మి గ్రామ పరిధిలోని లోతుగెడ్డ ప్రాంత ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించినట్లు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆక్రమణల తొలగింపునకు సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు వీఆర్వో మహేంద్ర, వీఆర్‌ఏ వీరాస్వామి ఆక్రమణ భూముల వద్ద బోర్డులు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలుచేపట్టినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సుదర్శనరావు విలేకరులకు తెలిపారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

నెల్లిమర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):పేదలకు పక్కాఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు కోరారు.నెల్లిమర్లలోని వార్డు సచివాలయంలో కార్యదర్శికి మంగళవారం వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో న్యూడెమొక్రసీ నాయకుడు కాళ్ల అప్పలసూరి పాల్గొన్నారు.

పీఎం పథకం కింద ఇళ్ల మంజూరు

వంగర, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పీఎం 2.0 పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ యు.సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం వంగరలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఇళ్లకోసం సచివాలయాల్లో ఇంజినీరింగ్‌అసిస్టెంట్లకు దరఖాస్తులు అందజేసేలా అవగాహన కల్పించాలని కోరారు.

ప్రభుత్వ కృషిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

గరివిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులు, పనితీరును ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. రాజాంలో మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీల ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటుబడ్జెట్ ఉన్నా రాజీ పడకుండా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని తెలిపారు. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడకూడదన్నారు. పార్టీ సభ్యత్వాలపై కూడా పూర్తిగా దృష్టిసారించాలని కోరారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా తాను అందుబాటులో ఉండానని చెప్పారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి


రైతులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పశుసంపద పెరిగి, పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. మంగళవారం మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరంతోపాటు లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా 72 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు, 56పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారు. ఆరోగ్యకరమైన లేగదూడలు గల ముగ్గురు రైతులకు బహుమతులను అందజేశారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక అధికారి వైవీ రమణ, ఉపసంచాలకులు రాధాకృష్ణ, పూసపాటిరేగ పశు వైద్యఅధికారి ఈశ్వర్ శ్రీనివాస్, సర్పంచ్ కోట్ల రఘు, జనసేన నాయకులు జలపారి శివ, బాల అప్పలరాజు, శంకాబత్తుల సత్తిబాబు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజంగా తీర్చిదిద్దుతాం

రేగిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షయరహిత సమాజంగా తీర్చిదిద్దుతామని బూరాడ, రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు చలమయ్య, అశిరినాయుడు తెలిపారు. మంగళవారం బూరాడ, రేగిడి పీహెచ్‌సీలో 100 రోజుల ప్రచారగోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం చైతన్యర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బూరాడ వైద్యాధికారి రీనాచౌదరి, ఎంపీఈవో రాధాకృష్ణ, సీహెచ్‌వో సుందరేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను పునర్నిర్మించాలి

భోగాపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):భోగాపురంలోని బీసీహాస్టల్‌ను పునర్నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ కోరారు. మంగళవారం విద్యార్థులు ఉంటున్న స్కూల్‌ను, శిథిలావస్థకు చేరిన హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే పాతభవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని కోరారు. వసతి గృహంలోని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, పి.రమేష్ పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ సర్వే పూర్తిచేయాలి


మినీ గోకులం పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రాజాం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):హౌస్ హోల్డ్ సర్వేను సర్వే వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో మినీ గోకులం పనులను పరిశీలించారు. అనంతరం ఒమ్మి, ఎంజేవలస, బీఎస్‌వలస, గారాజు చీపురుపల్లి గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రతి రోజు గ్రామంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

శృంగవరపుకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలోపీఎం జనమన్ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను మంగళవారం జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు పరిశీలించారు. గ్రామంలో 75 ఇళ్లను మంజూరుచేయగా, వాటి నిర్మాణాల గురించి ఆరాతీశారు.

కళాఉత్సవ్ పోటీలకు ఇద్దరు ఎంపిక

నెల్లిమర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు.దృశ్యకళలు (3డి ఆర్ట్) విభాగంలో నెల్లిమర్ల ఎంజేపీ ఏపీబీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని పి.సౌజన్యమణి, వాద్య సంగీతంలో విజయనగరం విద్యార్థిని బీఏ శివాత్మిక ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ ఒకప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ 2024-25 పోటీల్లో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించారు.అలాగే సంప్రదాయక కథలు చెప్పడంలో నెల్లిమర్ల బీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ఎస్.ఓజశ్విని, బి.నవ్య కలిసి ద్వితీయ స్థానం సాధించారని పగడాలమ్మ పేర్కొన్నారు. ఈమేరకు సత్తాచాటిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పగడాలమ్మతో పాటు వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, అధ్యాపకులు రవికుమార్, సూర్యారావు,రామకృష్ణ, ఈశ్వరరావు, భారతి అభినందించారు.

అయోధ్య రాముని ధనస్సుకు పూజలు

కొత్తవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం మొదటి అంతస్థులో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రతిష్ఠంచనున్న 13 కిలోల వెండి, కిలో బంగారంతో చల్లా శ్రీనివాసరావు శాస్త్రి సమర్పించనున్న ధనస్సు (బాణం) మంగళవారం కొత్తవలస-విశాఖ రహదారిలో గల దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ మేరకు భక్తులు వెలివల లక్ష్మీ శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో పూజలను చేశారు.

రైతులకు పరిహారం అందేలా చర్యలు: ఆర్డీవో

భోగాపురం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా అప్రోచ్ రోడ్డుకు సంబంధించి భూములు తీసుకున్న రైతులకు న్యాయస్థానం ద్వారా వీలైనంత త్వరగాగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో దాట్ల కీర్తి తెలిపారు. మంగళవారం మండలంలోని అమటాంరాయవలసలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ 2020 కొవిడ్ సమయంలో సర్వే చేయడంతో చాలా వరకు రైతులు అందుబాటులో లేకపోవడంతో అప్రోచ్ రోడ్డుకు సంబంధించి కొంత మంది పరిహారం న్యాయస్థానానికి అప్పగించినట్లు తెలిపారు. అన్ని దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేష్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడశివారెడ్డి, ఆర్‌ఐ ఇమ్రాన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

డెంకాడ, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. మంగళవారం అక్కివరంలో తహసీల్దార్ వి.పద్మావతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదస్సుల్లో రైతులు అందజేసిన ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, సర్పంచ్ కిరణ్ పాల్గొన్నారు.

టీఎంఎల్ బాక్సులు ఏర్పాటు చేయాలి: డీఈవో

లక్కవరపుకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల మెరుగుపడేందుకు పాఠశాలల్లో టీఎంఎల్ బాక్సులు ఏర్పాటుచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం శ్రీరాంపురంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు భాషలపై ఉన్న పట్టును పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో కూర్మారావు, రాజు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

వేపాడ,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలు నిర్వహించేకేంద్రాలను ఎంఈవో బాలభాస్కరరావు పరిశీలించారు.ఈ మేరకు పరీక్షల నిర్వహణకు త్రీమెన్ కమిటీగా ఎంఈవో, వేపాడ, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు వల్లి, బీపీఏ రాజులను నియమించారని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు విక్టరీ, వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత, కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించినట్లు చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చని ఎంఈవో -1 జి.జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం వేపాడ జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంఈవో-2 భాల భాస్కరరావుతో పాటు కలిసి పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరును తనిఖీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవానికి రాష్ట్రపతికి ఆహ్వానం


ద్రౌపది ముర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్నిఅందజేశారు. అనంతరం వచ్చే ఏడాది మార్చి నెల 8న విజయనగరంలో జరిగే మహిళా దినోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఏపీ చేనేత కార్మికులు నేసిన నేత చీరను ఆమెకు కుటుంబ సమేతంగా బహూకరించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, నారా లోకేష్ కూడా మంగళగిరిలో చేనేత కార్మికులు తయారుచేసిన చీరల కోసం ప్రత్యేక వెబ్‌సెట్‌ను కూడా ఏర్పాటు చేశారని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి):విజయనగరంలోని20 డివిజన్ ఫైనల్ వీధిలో అంబేడ్కర్ కమిటీ సభ్యులు టి.రాంబాబు, రమణ ఆధ్వర్యంలో తలే సీతారాం, డాక్టరు తలే మధుసూధనరావులు రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నగర అధ్యక్షుడు సింహాచలం, అంబేడ్కర్ రైట్స్ ప్రతినిధి వెంకట రమణ, వీర్రాజు, మహేంద్రబాబు, కనకరాజు, పైడిరాజు, గోపి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సమాన హక్కులతో జీవించాలి


మాట్లాడుతున్న అప్పలస్వామి

విజయనగరం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఎటువంటి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కులను ప్రవేశపెట్టిందని జిల్లా అదనపు న్యాయాధికారి అప్పలస్వామి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కళ్యాణ చక్రవర్తి ఆదేశాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ 1948 డిసెంబరు 10న పారిస్ వేదికగా సభ్యదేశాలన్నీ సమాన హక్కులతో జీవించాలని యూఎన్‌వో కీలక ఒప్పందంపై సంతకాలు చేశాయని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఏటా డిసెంబరు 10న మానవహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖైదీలకు న్యాయపరంగా సాయం

శృంగవరపుకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖైదీలకు న్యాయపరంగా ఎటువంటి ఆర్థిక అసమనతలకు లోనుకాకుండ ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు న్యాయాధికారి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ సబ్బవరపు వాణి తెలిపారు. మంగళవారం శృంగవరపుకోట సబ్ జైలులో మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల దినోత్సవం ఆవశ్యకతను వివరించారు.

శ్మశాన వాటిక నిర్మించాలి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

శృంగవరపుకోట, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): రేగ పుణ్యగిరి ఒకటో వార్డులో శాశ్వత శ్మశాన వాటిక నిర్మించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈసందర్భంగా డీటీ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ పాల్గొన్నారు.

స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థి

విజయనగరం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన గోజోరియో కరాటే దో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి ఎం.సాయి కృష్ణ ప్రతిభ కనబరిచి బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ మేరకు ఆయన్ను పలువురు అభినందించారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

గంట్యాడ,డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):ధాన్యం డబ్బులు చెల్లించాలని మురపాక రైసు మిల్లు వద్ద రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట మురపాక పరిధిలో ఉన్న రైసు మిల్లుకు ధాన్యం ఇచ్చామని, అప్పటిలో మిల్లు యజమాని ధాన్యం డబ్బులు ఇవ్వలేదని వాపోయారు. సుమారు కోటి రూపాయలకు పైబడి డబ్బులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ధాన్యం డబ్బులిచ్చిన తర్వాతే ఈ ఏడాది మిల్లుకు ధాన్యం తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈసమస్య తెలుసుకున్న తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్‌ఐ సాయి కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వస్తే ఇరువర్గాలతో మాట్లాడుదామని రైతులకు చెప్పడంతో వారు నిరసన విరమించారు.

ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



రహదారి పనులను ప్రారంభిస్తున్న విప్ జగదీశ్వరి

కొమరాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని రామభద్రపురం - అల్లువాడ రహదారి పనులకు ఆమె మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఉలిపిరి, చోళ్లపధం గ్రామ సచివాలయాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రహదారి నిర్మాణం చేపట్టాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేశ్ చంద్రదేవ్, జి.సుదర్శనరావు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కె.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవో

పార్వతీపురం, డిసెంబరు10 (ఆంధ్ర జ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలకు, గురుకులాలకు నాణ్యమైన ఆహార పదార్థాలను పంపిణీ చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ట్రేడర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఆధ్వర్యంలో ఫుడ్ ప్రావిజన్స్(ఆహార పదార్థాలు) టెండర్ ప్రక్రియ నిర్వహించారు. వీటిని జీసీసీ ద్వారా ఐటీడీఏ పరిధిలో గల అన్ని సంక్షేమ వసతి గృహాలకు, గురుకులాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియలో మొత్తం 14 మంది ట్రేడర్లు పాల్గొన్నట్లు చెప్పారు. సరుకులను సకాలంలో పంపిణీ చేయనిచో తిప్పి పంపించాలని, వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని సంబంధిత అధికారులను పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్, డీఎం జీసీసీ, ఏపీఓ, ఏటీడబ్ల్యూవో తదితర అధికారులు పాల్గొన్నారు.

లేఅవుట్ల పరిశీలన

పాచిపెంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు జగనన్న లేఅవుట్లను విజిలెన్స్ అధికారి ఎ.కామేశ్వరరావు మంగళవారం సందర్శించారు. పి.కోనవలస, పిండ్రింగివలస, పెదచీపురువలస, చిన చీపురువలస, అమ్మవలస, కర్రివలస గ్రామాల్లో గల జగనన్న లేఅవుట్లను ఆయన పరిశీలించారు. లేఅవుట్లకు సంబంధించిన వివరాలను మండల హౌసింగ్ ఏఈ వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అక్రమాలకు సంబంధించిన కోణంలో కూడా పరిశీలించారు. సమగ్ర పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

పాలకొండ డిపోకు నాలుగు బస్సులు

పాలకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏపీఎస్ ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా నాలుగు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సులు వచ్చాయని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులను పాలకొండ నుంచి శ్రీకాకుళానికి, పాలకొండ-విశాఖపట్నానికి ప్రస్తుతం నడుపుతామని తెలిపారు. చీపురుపల్లి బ్రిడ్జి పనులు పూర్తయిన తర్వాత వీటిని పాలకొండ నుంచి విశాఖపట్నానికి నేరుగా నడుపుతామని చెప్పారు. నూతనంగా డిపోకు వచ్చిన ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సులకు పూజలు నిర్వహించి లైన్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో ఎంఎఫ్ ఎల్.రాము, ఏఎంఎఫ్ జగన్నాథం, టైర్ల ఏడీసీ బీకే మూర్తి, డ్రైవర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిద్దాం

జియ్యమ్మవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిద్దామని ఎంపీడీవో శంబంగి రమేష్, తహసీల్దార్ ఆర్.పకీరు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేద్దామని అన్నారు. నీటి పారుదల శాఖ ఏఈఈ జీవీ రఘు, ఎంఈవో-2 ఎం.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

పార్వతీపురంటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో గల చిన్న చిన్న గుంతలను మంగళవారం పూడ్చారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన అచ్చెన్నాయుడు.. జిల్లాలో రహదారులను మర్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారుల సూచనతో సంబంధిత కాంట్రాక్టర్లు రహదారులపై ఉన్న గుంతలను పూడ్చారు.

హిందువులపై దాడికి నిరసన

రాయగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం రాయగడలో హిందూ సమాజం తరఫున ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో వేలమంది హిందువులు పాల్గొని, బంగ్లాదేశ్ చర్యలను ఖండిస్తూ జైశ్రీరామ్ అంటూ చేసిన నినాదాలు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేరిట రాసిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

10 ఆర్‌జి 02 ర్యాలీలో పాల్గొన్న హిందూ సమాజ సభ్యులు

క్రీడా పోటీలకు శ్రీకారం

ఒడిశా

రాయగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా సాంస్కృతిక ఉత్సవం చౌయితి ఈనెల 26 నుంచి నిర్వహించనున్న సందర్భంగా మంగళవారం రాయగడ జిల్లా యంత్రాంగం వివిధ క్రీడలకు శ్రీకారం చుట్టింది. ఉదయం 6 గంటలకు స్థానిక రిలయన్స్ పెట్రోలు బంకు నుంచి హాలువా తోట వరకు నిర్వహించన మారథాన్ రేస్‌లో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రారంభించారు. మహిళలకు స్థానిక అటానమస్ కళాశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీలను తహసీల్దార్ ప్రియదర్శిని, డీఐపీఆర్వో బసంతకుమార్ ప్రధాన్, విశ్రాంత అధ్యాపకుడు దుష్మంత్ కుమార్ మహంతి పాల్గొని ప్రారంభించారు. అంగన్‌వాడీ- సాంస్కృత భవన్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో అంగన్‌వాడీ మహిళా జట్టు గెలుపొందింది.

దళారుల వలకు చిక్కొద్దు

రాయగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల వలకు చిక్కకుండా తాము పండించిన పత్తిని ప్రభుత్వ మండీలలో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ఎంసీఎస్ కార్యాలయం ప్రాంగణంలో ప్రారంభించిన పత్తి మండీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీఎస్ సన్యాశిరాజు, బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. నిర్మాణం పూర్తి కాక

● అర్థాంతరంగా దిబ్బగుడ్డివలస సచివాలయ భవన నిర్మాణం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సచివాలయ భవనాలను నిర్మించి, ఉద్యోగులను నియమించింది. కానీ కొన్ని చోట్ల సచివాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో గత ఐదు ఏళ్ల కిందట ప్రారంభించిన సచివాలయ భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. బిల్లులు చెల్లించనందున గుత్తేదారు గత ఆరు నెలలుగా నిర్మాణ పనులు నిలిపివేశారు. నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఈ విషయంపై మండల ఇంజినీరింగ్ అధికారి రాజశేఖర్‌ని వివరణ కోరగా ప్రభుత్వం మారిన తర్వాత కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్న ట్లు గుత్తేదారు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్ధాంత రంగా నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తి కాని సచివాలయ భవనం

ఇక.. మూడు నెలలే!

(ఐదో పేజీ తరువాయి)

పనులు పూర్తి కావల్సి ఉంది. కానీ కేవలం 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. 2023 డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి కావలసి ఉన్నా వైసీపీ ప్రభుత్వ తీరు వల్ల జరగలేదు.

వెంగళరాయసాగర్ ప్రాజెక్టు

ఈ ప్రాజెక్టు సాలూరు మండలం లక్ష్మీపురం గ్రామం వద్ద సువర్ణముఖి నదిపై ఉంది. దీని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా మూడు మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీరందేలా డిజైన్ చేశారు. వీఆర్ఎస్ ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలు, బొబ్బిలిలో 6,427 ఎకరాలు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాకలు సాగునీరందించనుంది. దీని ఆధునికీకరణకు 2019 ఫిబ్రవరి 15న పరిపాలనా ఆమోదం, 2020 జూలై 11న సాంకేతిక ఆమోదం లభించాయి. పెదంకలాం ప్రాజెక్టు ఆధునికీకరణకు ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలే దీని పనుల బాధ్యతలు చేపట్టాయి. 2020 ఏప్రిల్ 26లోగా రూ. 48.90 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాస్తవానికి 2023 ఏప్రిల్ 25 నాటికి ఈ పనులు పూర్తి కావలసి ఉంది. కానీ కేవలం 21 శాతం పనులే జరిగాయి. దీనికి 2025 మార్చి 24 వరకు గడువు పెంచారు.

వట్టిగెడ్డ రిజర్వాయర్

ఈ ప్రాజెక్టు జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామానికి ఆనుకుని ఉంది. దీని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యంతో నిర్మించారు. జైకా ద్వారా రూ.44.85 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు 2019 జనవరి 8న పరిపాలన ఆమోదం లభించింది. 2020 ఆగస్టు 19న సాంకేతిక ఆమోదం కూడా లభించింది. విజయవాడకు చెందిన సాయిలక్ష్మి కనస్ట్రక్షన్స్ వారు 2021 జనవరి 8న నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. వాస్తవానికి 2023 జనవరి 7 నాటికి పనులు పూర్తి కావల్సి ఉంది. కానీ 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఇలా ఈ నాలుగు ప్రాజెక్టుల పనులు నత్తనడకన జరగడంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వచ్చే ఏడాది మార్చి లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లను ఆదేశించాం..

ప్రాజెక్టుల ఆధునికీకరణ విషయంలో 2025 మార్చిలోగా పనులు చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. అప్పటివరకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మిగిలిన నిర్మాణాల విషయంలో సర్కారు తగు చర్యలు తీసుకోనుంది.

-ఎస్. సుగుణాకరరావు, ఇన్‌చార్జి ఎస్ఈ, నీటి పారుదలశాఖ, పార్వతీపురం మన్యం

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీపీ శంబంగి లక్ష్మి ఆధ్వర్యంలో 'గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు' అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులను కేటాయించాలన్నారు. ఈవోపీఆర్డీ భాస్కరరావు మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేటట్టు పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● రామభద్రపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రత్నం కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే కాకుండా సమస్యలు లేని గ్రామాలుగా చేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, టీవోటీలు శ్రీనివాస్, నడిమింటి వాసుదేవరావు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరమైన అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే ప్రజలను సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం గాంధీజీ ఆశయ సాధనకు అంతా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు, ఎంఈవో జి.సూరిదేముడు, పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ

బాడంగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12 నుంచి రెండు రోజులపాటు సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

బాడంగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా హౌస్‌హోల్డ్ జీయో కోఆర్డినేట్స్, ఎన్పీసీఐ, మిస్సింగ్ సిటిజెన్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేపైన సమీక్ష నిర్వహించారు. అలాగే 12, 13 తేదీల్లో నిర్వహించనున్న శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

14న గో రక్షకుల ఆత్మీయ కలయిక

బొబ్బిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న విజయనగరంలో గో రక్షకుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్టు ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆర్డీవో రామ్మోహనరావు విడుదల చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యానారాయణ, మహిళా అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి పాల్గొన్నారు.

పేదలకు అన్న వితరణ

పార్వతీపురంటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద జిల్లా హెచ్‌ఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్న వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, పట్టణ సీఐ మురళీధర్ పాల్గొని, పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ఎస్ సభ్యులు ఎం.వెంకటేష్, వి.జగదీష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనకు కృషి చేయండి

● డిప్యూటీ డీఈవో నారాయుడు

సీతంపేట రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో పి.నారాయుడు సూచించారు. మంగళవారం పెద్దపొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను నేరుగా తెలుసుకున్నారు. ఈ నెల ఆఖరు నాటికి సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి బోధించాలని అన్నారు. గణితం, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. డైలీ టెస్టులు నిర్వహించాలని సూచనలు చేశారు.

బాలికలకు కిశోరి వికాసం ఒక వరం

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ రాణి



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ రాణి

గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికలకు కిశోరి వికాసం ఒక వరమని, అలాగే బాలికల బంగారు భవిష్యత్తుకు ఈ కార్యక్రమం పునాది వేస్తుందని మన్యం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపర్చడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి, అవగాహన కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, డీసీపీవో ఎ.సత్యనారాయణ, డాక్టర్ కేకే సాగర్‌వర్మ, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, అరుణకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లకు వైద్య పరీక్షలు

కురుపాం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కురుపాం సీహెచ్‌సీలో మంగళవారం ట్రాన్స్‌జెండర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైడీవో నెట్‌వర్క్ అవుట్‌రీచ్ వర్కర్, ట్రాన్స్‌జెండర్ అధ్యక్షురాలు గీతారాణి ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెడ్ నర్సు జి.ఈశ్వరమ్మ, ఐసీటీసీ కౌన్సిలర్ మోహనరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

బొబ్బిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం నాయకుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక 5, 6, 7 వార్డులలో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ నాయకులు మునకాల శ్రీనివాస్, బలస శ్రీనివాసరావు, గోపాలం, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● బాడంగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు స్మార్ట్ మీటర్లను తీసుకువచ్చే యోచనలో ఉండడం తగదని సీపీఎం మండల నాయకులు అన్నారు. ప్రతిఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ● రామభద్రపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రముఖ పారిశ్రామికవేత్త అదానికి కొమ్ముకాయడమే కాస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ మహిళా నాయకురాలు లెంక లక్ష్మి, సీపీఎం నాయకుడు రామిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.



బొబ్బిలి: స్మార్ట్ మీటర్లపై ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాలు

కొనసాగుతున్న సమ్మె

పార్వతీపురంటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు మంగళవారం కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వీరు సమ్మె చేపడుతున్నారు.



నిరసన తెలుపుతున్న నీటి సరఫరా విభాగం కార్మికులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

పాచిపెంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపల్లి రోడ్డు జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పి.కోనవలస నుంచి సాలూరు వెళ్తున్న వ్యాను, చెరుకుపల్లి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 వాహనం ద్వారా సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు సాలూరులో చికిత్స పొందుతుండగా, ఆదిత్య అనే వ్యక్తికి మెరుగైన వైద్యం కోసం సాలూరు నుంచి విజయనగరం తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

టైరు పేలి డివైడర్‌ను ఢీకొన్న కారు

● తహసీల్దార్‌కు స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు

వీరఘట్టం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కారు టైరు పేలి డివైడర్ ఢీకొట్టిన ఘటనలో వీరఘట్టం తహసీల్దార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ విధులు ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా వీరఘట్టం ప్రధాన రహదారిలో కారు టైరు పేలి, డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి సౌజన్య, వ్యవసాయ సహాయకురాలు కమలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆస్పతిలో ప్రథమ చికిత్స అనంతరం వారు ఇంటికి వెళ్లిపోయారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కురుపాం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక రావాడ కూడలి వద్ద ఉన్న బస్‌షెల్టర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు కురుపాం ఎస్ఐ నారాయణరావు తెలిపారు. కురుపాం వీఆర్వో పి.మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వరి కుప్ప దగ్ధం

సీతానగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బక్కుపేట గ్రామంలో మంగళవారం ఓ వరి చేను కుప్ప దగ్ధమయ్యింది. గ్రామానికి చెందిన కె.వెంకటరమణ అనే రైతు పది రోజుల కిందట వరి చేలు కోశారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల 50 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న కోసిన వరి చేనును మడిలోనే కుప్ప వేశారు. ఈ వరి చేను కుప్ప కాలిబూడిదవ్వడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. 13 క్వింటాళ్ల ధాన్యం కాలిబూడిదైనట్లు తెలిపాడు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించారు.

చాగంటి నియామకంపై విమర్శలు తగవు

సాలూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించడం పట్ల కొందరు విమర్శలు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాలి చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడానికి కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని చాగంటిని సలహాదారుగా నియమించడం మంచి నిర్ణయమన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించండి

వీరఘట్టం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో బి.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఐసీడీఎస్ పీవో బి.సిమాలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, రిసోర్స్ పర్సన్‌లు పి.శ్రీధర్, ఎన్జీవో అధికారి పి.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

గరుగుబిల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని ఆలయ అభివృద్ధి ప్రతినిధి డా.డి.పారినాయుడు తెలిపారు. మంగళవారం పార్వతీపురానికి చెందిన ప్రముఖ వైద్యుడు గరిమెళ్ల ప్రభాకరశాస్త్రి రూ.2లక్షలు విరాళంగా అందించారని చెప్పారు.